సాక్షి చిత్తూరు

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



వరలక్ష్మీ వ్రతానికి సర్వం సిద్ధం

తిరుచానూరు శ్రీ పద్మావతి ఆలయంలో వరలక్ష్మీ వ్రతానికి సర్వం సిద్ధం చేసినట్లు జేఈవో వీరబ్రహ్మం తెలిపారు - IIలో



ద్రవిడ వర్సిటీ విద్యార్థుల నిరసన

నాణ్యమైన భోజనం పెట్టడం లేదంటూ గురువారం ద్రవిడ వర్సిటీ హాస్టల్ విద్యార్థులు నిరసన చేపట్టారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	26
తిరుపతి	38	27
తిరుమల	33	22
గూడూరు	39	28
నగరి	38	26

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సెలవు ప్రకటించినట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి కేటాయించిన ఐచ్ఛిక లీవుల్లో భాగంగా రెండో సెలవును శుక్రవారం ఉపయోగించుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



సూచనలిస్తున్న వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న

గుడిపాల: పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. గురువారం గుడిపాల రైతు భరోసా కేంద్రం ఆవరణలో రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మిరప సాగులో ఆకుముడత, వంగ, టమాటాలో కాయ తొలుచు పురుగు నివారణపై సమగ్ర సస్యరక్షణ యాజమాన్యాన్ని వివరించారు. వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగుతో పర్యావరణ పరిరక్షణ, సుస్థిర దిగుబడులు పొందవచ్చని తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. మండల వ్యసాయాధికారి మాధవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ యోగప్రియ పాల్గొన్నారు.


భూ రీసర్వే వేగవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో రెండోదశ భూ రీసర్వే పనులను వేగవంతం చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం సీసీఎల్ఏ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి సాయిప్రసాద్ రీసర్వేపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాల వివరాలను కలెక్టర్ వివరించారు. మొదటి దశలో 130 గ్రామాలకు గాను 104 గ్రామాల్లో 61,717 సర్వే రాళ్లు నాటినట్లు తెలిపారు. ఇంకా 58 వేల సర్వే రాళ్లు నాటాల్సి ఉందన్నారు. రెండో దశలో 105 గ్రామాల్లో సర్వే పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయని తెలిపారు. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి క్షేత్ర స్థాయిలో క్షుణంగా పరిశీలించి లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 534 మంది ఎంపిక



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

చిత్తూరు కార్పొరేషన్: పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 259 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మీరా సాహెబ్ తెలిపారు. మొత్తం 534 మంది విద్యార్థులు మేళాలో పాల్గొన్నారని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ షణ్మోహన్ కార్యక్రమానికి విచ్చేసి మాట్లాడారు. పలు కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి, కళాశాల అధ్యక్షురాలు జీవనజ్యోతి, జేకేసీ కో ఆర్డినేటర్ బాబు, మెంటార్స్ రేఖ, సూర్యప్రకాష్, అకడమిక్ కోఆర్డినేటర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

27న తెలుగుభాషా దినోత్సవం

చిత్తూరు కార్పొరేషన్: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 27న తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు తులసీనాథంనాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పలమనేరు కళామందిరంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. తెలుగును ప్రోత్సహించడంలో భాగంగా ఈ సందర్భంగా పద్యాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. ప్రశంసాపత్రం, జ్ఞాపిక, పుస్తకాలు బహుమతిగా అందిస్తామన్నారు. అత్యధికంగా పద్యాలు చెప్పినవారికి అదనంగా నగదు బహుమతి ఇస్తామని వివరించారు.

చంద్రయాన్–3 విజయంలో కీలక పాత్ర పోషించిన అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్పన శ్రీకాళహస్తి స్వగ్రామం తడుకుపేటలో సంబరాలు మిన్నంటాయి. 'ఆమె మా అక్కే.. మా పెద్దనాన్న కూతురే.. నా మేనత్త కూతురే' అంటూ వరసలు కలుపుతూ స్థానికులు ఉప్పొంగిపోయారు. మిఠాయిలు పంచుతూ, టపాకాయలు కాల్చుతూ సందడి చేశారు. చంద్రయాన్ విజయంలో 'మా ఊరి బిడ్డ' భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందంటూ మురిసిపోయారు. ఇక్కడే పుట్టి.. అందరితో కలిసిమెలిసి తిరిగి నేడు గగన విజయ యాత్రలో కీలక భూమిక పోషిస్తున్నందుకు గర్వంగా ఉందని సంబరపడ్డారు. ఆదపడుచు కృషిని శ్లాఘిస్తూ శ్రీకాళహస్తి వాసులు ఆనందం వ్యక్తం చేశారు. జయహో కల్పన.. భారత్‌మాతాకీ జై అంటూ జేజేలు పలికారు. ఆమెతో ఉన్న అనుబంధాలు, మధుర క్షణాలను నెమరు వేసుకుని ఆనంద సాగరంలో మునిగిపోయారు.



గఘన విజయంలో.. మా ఊరి కల్పన



కల్పన

- చంద్రయాన్–3 మిషన్ బృందంలో తడుకుపేట వాసి కల్పన
- చంద్రయాన్ విజయంలో కీలకపాత్ర
- చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న బంధువులు, గ్రామస్తులు
- మిఠాయిలు పంచుతూ, టపాసులు కాల్చుతూ సంబరాలు చేసుకున్న స్థానికులు

నగరి: విశ్వ ఘనత సాధించిన మిషన్ డిప్యూటీ డైరెక్టర్ కల్పన స్వగ్రామం నగరి మండలం, తడుకుపేటలో గురువారం పండుగ వాతావరణం నెలకొంది. చంద్రయాన్–3 ప్రయోగంలో 'మాఊరి కల్పన' అంటూ గ్రామస్తులు కేరింతలు కొట్టారు. గ్రామంలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఊర్లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే కల్యాణోత్సవానికి కుటుంబ సమేతంగా వస్తుంటారంటూ సంబరపడ్డారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైస్ ఎంపీపీ కన్నియప్ప విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ జయహో భారత్.. అంటూ నినాదాలు చేస్తూ కల్పనకు తమ అభినందనలు తెలిపారు. ప్రపంచమే తిరిగి చూసేలా చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగిడిన తొలి దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించడం వెనుక మా ఊరి బిడ్డ కృషి ఉండడం మాకెంతో గర్వకారణమంటూ సంబరపడిపోయారు.



సంబరాలు చేసుకుంటున్న తడుకుపేట గ్రామస్తులు



తడుకుపేటలో స్వీట్లు తినిపించుకుంటున్న విద్యార్థినులు

కల్పన నేపథ్యం ఇదీ

కల్పన తండ్రి మునిరత్నం మొదట్లో స్వగ్రామం తడుకుపేటలోనే ఉన్నారు. ఈయన తిరుత్తణికి చెందిన ఇందిరను వివాహం చేసుకున్నారు. హైకోర్టు బెంచ్‌క్లర్కుగా ఉద్యోగం సంపాదించడంతో కుటుంబం చెన్నై, అంబత్తూరుకు వెళ్లి స్థిరపడింది. అక్కడే కల్పన మద్రాసు యూనివర్సిటీలో బీటెక్ ఈసీఈ చదివారు. ఈమెకు శ్రీకాళహస్తికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సునీల్‌తో వివాహం జరిగింది. ఇస్రోలో స్పేస్‌సెంటర్ రాడార్ ఇంజినీర్‌గా 2000లో చేరారు. 2005లో యూఆర్ రావ్ శాటిలైట్ సెంటర్ బెంగళూరుకు శాటిలైట్ బిల్డింగ్ ఇంజినీర్‌గా పదోన్నతిపై వెళ్లారు. గతంలో సెకండ్ లూనార్ మిషన్‌లోనూ, మంగళ్‌యాన్ మిషన్‌లోనూ పనిచేసిన అనుభవం ఉంది. ఈమె చంద్రయాన్–3లో అసోసియేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రధాన పాత్ర పోషించారు. ఈమెకు ఒక కుమార్తె ఉంది.

కల్పనను అభినందించిన మంత్రి



చంద్రయాన్–3 విజయంలో ముఖ్యపాత్ర పోషించిన కల్పనను మంత్రి ఆర్కే రోజా ఫోన్ ద్వారా అభినందించారు. విశ్వవ్యాప్తంగా దేశకీర్తిని ఇనుమడింపజేసిన చంద్రయాన్ ప్రాజెక్టులో ప్రాధాన్యత వహించిన కల్పనది తమ నియోజకవర్గంలోని తడుకుపేట స్వస్థలం కావడం గర్వకారణంగా ఉందని చెప్పారు.

జయహో ఇస్రో



చిట్టమూరు జీఎంఎన్ జెడ్పీహైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన

ఆడపడుచుకు అందలం



శ్రీకాళహస్తి: శుకబ్రహ్మాశ్రమంలో సంబరాలు

మిన్నంటిన సంబరం



యాదమరి: అగరంపల్లెలో ర్యాలీ చేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చంద్రదరహాసం



నగరి: తడుకుపేటలో సంబరాలు చేసుకుంటున్న గ్రామస్తులు

మా ఊర్లోనే పుట్టింది



నేడు దేశమంతా గర్వించేలా చేసిన చంద్రయాన్–3 బృందంలోని కల్పన మా గ్రామంలోనే పుట్టింది. ఆమె మా మేనమామ కుమార్తె. బంధువుల పెళ్లిళ్లు, వేడుకల్లో కలుస్తుంది. గ్రామంలో జరిగే వేడుకల్లోనూ కలుసుకుంటూ ఉంటుంది. అంత పెద్ద ఉద్యోగంలో ఉన్నా భేషజాలు ఏమీ ఆమెలో కనిపించవు. నేడు ఇంత పేరుప్రతిష్ఠలు తెచ్చిందంటే అది మా గ్రామానికే గర్వకారణం.

– శారద, తడుకుపేట

సైంటిస్ట్ కావాలన్నదే ఆమె కోరిక



నేడు ఇంతటి పేరుప్రతిష్ఠలు సాధించిన కల్పన తండ్రి మునిరత్నం నాకు పెదనాన్న అవుతారు. ఆమె అక్కవుతుంది. ఆమెకు చిన్నతనం నుంచే సైంటిస్ట్ కావాలన్న కోరిక ఉండేది. అందుకే బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ చదివింది. ఇస్రోలో ఉద్యోగం సంపాదించింది. నేడు దేశానికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చిన ఒక బృందంలో ఆమె ఉందంటే మాటల్లో చెప్పలేనంత ఆనందాన్ని కలిగిస్తోంది.

– కే.ధర్మేష్, తడుకుపేట

ఆలయ ఉత్సవాలకు వస్తుంటారు



గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్పన తండ్రి మునిరత్నం ట్రస్టీ మెంబర్. ప్రతి ఏడాదీ గ్రామంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి కల్పన వస్తూ ఉంటారు. అప్పుడప్పుడూ కల్పన కూడా కలుస్తూ ఉంటుంది. నాకు మేనమామ కుమార్తె అవుతుంది. చిన్నతనం నుంచే చదువులో దిట్ట. నేడు మేమంతా గర్వపడేంతలా పేరుప్రతిష్ఠలు సాధించింది.

– ప్రసాద్, తడుకుపేట

ఇక్కడ ఇంటి స్థలం కూడా ఉంది



కల్పన నాకు మేనత్తకూతురు. అప్పుడు వారు పూరింట్లో ఉండేవారు. కల్పన తండ్రి హైకోర్టులో బెంచ్‌క్లర్క్. కల్పన పుట్టిన కొన్నాళ్లకే తిరుత్తణికి వెళ్లిపోయారు. అటు పిమ్మట చెన్నైకు వెళ్లి స్థిరపడ్డారు. వారున్న ఇల్లు పూర్తిగా కూలిపోగా స్థలం మాత్రం అలాగే ఉంది. వారున్న వీధిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ వేడుకలకు వస్తుంటారు. ఆ సమయంలో ఇంటి స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు శుభ్రం చేసి వెళుతుంటారు.

–ఏ.ధనంజయులు, తడుకుపేట

వందశాతం లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

- కలెక్టరేట్‌లో ద్వైవార్షిక లబ్ధి కార్యక్రమం
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, మేయర్ అముద
- 4,455 మంది లబ్ధిదారులకు రూ.4.85 కోట్ల లబ్ధి



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, మేయర్ అముద

చిత్తూరు కార్పొరేషన్: అర్హత ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని వారికి ప్రభుత్వం ఏటా రెండు సార్లు లబ్ధిదారులను గుర్తించి వందశాతం సంక్షేమ పథకాల ప్రయోజనం చేకూరుస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం తాడేపల్లె క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వైవార్షిక కార్యక్రమం కింద బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు నిధులను జమ చేశారు. కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్, మేయర్ అముద పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పలు పథకాలకు అర్హత కలిగిన 4,455 మందికి రూ.4.85 కోట్లను వారి ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. ద్వైవార్షిక లబ్ధిని అందించడంలో భాగంగా గత డిసెంబర్ నుంచి ఈ ఏడాది జూలై వరకు అమలైన పథకాల పరంగా అర్హత ఉండి లబ్ధి అందనివారిని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఏటా రెండు సార్లు ఇలా అర్హులను గుర్తించి వారి ఖాతాలకు ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందన్నారు. జిల్లాలో వైఎస్సార్ ఆసరా పథకం 114 మంది లబ్ధిదారులకు రూ.27.10 లక్షలు, రైతు భరోసా పథకం కింద 301 మందికి రూ.12.29 లక్షలు, జగనన్న వసతి దీవెన పథకం కింద 987 తల్లుల ఖాతాలకు రూ.89.11 లక్షలు, జగనన్న విద్యా దీవెన పథకం కింద 1136 మంది విద్యార్థుల తల్లులు ఖాతాలకు రూ.1.71 కోట్లు, అమ్మ ఒడి పథకం కింద 331 మందికి రూ.43.03 లక్షలు, చేదోడు పథకం కింద 945 మందికి రూ.94.05 లక్షలు, ఈబీసీ నేస్తం కింద 315 మందికి రూ.47.25 లక్షలు, నేతన్న నేస్తం కింద ఇద్దరికి రూ.48 వేలు అందజేసినట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ జోనల్ చైర్మన్ శైలజారెడ్డి, జెడ్పీ మహిళ స్థాయి సంఘం చైర్మన్ భారతి, డీఆర్‌డీఏ పీడీ తులసి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వరలక్ష్మీవ్రతం సందడి





జిల్లాలో గురువారం వరలక్ష్మీ వ్రతం సందడి నెలకొంది. శుక్రవారం జరిగే వ్రత పూజకు అవసరమయ్యే సామగ్రి కొనుగోలుకు వచ్చిన జనంతో తిరుపతిలోని వీధులు కిక్కిరిశాయి. అమ్మవారి ప్రతిమలు, పూలు, పండ్లు, అరటి పిలకలు, గాజుల దుకాణాలు కిటకిట లాడాయి. మల్లె పూలు కిలో రూ. వెయ్యి, చామంతి, రోజాలు కిలో రూ.250 ధర పలికాయి. - సాక్షి ఫొటో గ్రాఫర్, తిరుపతి

చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా భరత్

- వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీని ప్రకటించిన కేంద్ర కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నూతన కమిటీ జాబితాను విడుదల చేశారు. ఈమేరకు.. చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్(కుప్పం)ను మరోసారి నియమించారు. ఉపాధ్యక్షులుగా హేమసుందర్‌రెడ్డి(పుంగనూరు), శరత్‌రెడ్డి(పూతలపట్టు), కోశాధికారిగా పి.ధనంజయరెడ్డి(జీడీనెల్లూరు), ప్రధాన కార్యదర్శులుగా మాదిరాజు ప్రదీప్‌రాజు(పుంగనూరు), పీఎస్.వినోద్‌కుమార్(కుప్పం), విమల లక్ష్మీనారాయణ(పలమనేరు), కార్యదర్శులుగా ప్రభాకర్‌రెడ్డి(పుంగనూరు), టి.చిన్నచెంచురెడ్డి(పుంగనూరు), వి.లోకేష్‌రెడ్డి(కుప్పం), తమ్మిరెడ్డి(పలమనేరు), పి.శ్రీధర్‌రెడ్డి(చిత్తూరు), ఎం.మనోహర్‌రెడ్డి(పూతలపట్టు), మేరీ(నగరి), ఎం.గోపి (జీడీనెల్లూరు) నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మునిరత్నంరెడ్డి(పుంగనూరు), కంరుద్దీన్(పుంగనూరు), పి.రాఘవరెడ్డి(పుంగనూరు), పి.కృష్ణాయ్య(పుంగనూరు), జఫర్‌హుసేన్ అలియాస్‌బాబు(పుంగనూరు), లత(కుప్పం), ప్రమీల(కుప్పం), బి.చంద్రప్ప(కుప్పం), అనిత(కుప్పం), కె.శివగామి(కుప్పం), ఎస్.రఘుపతి(పూతలపట్టు), పి.శ్వేతప్రియ(పూతలపట్టు), నాగేశ్వరి(పూతలపట్టు), బి.భారతి(పూతలపట్టు), ఎం.చందురాయల్(పూతలపట్టు), రాధకృష్ణా(పలమనేరు), బి.జాన్సీమురళీ(పలమనేరు), మమత(పలమనేరు), సుహెబ్(పలమనేరు), జి.సుధారఘుపతినాయుడు(పలమనేరు), ఆర్.హరి(చిత్తూరు), సీకే సురేష్‌కుమార్(చిత్తూరు), ఎం.సుబ్రమణ్యం(చిత్తూరు), ఎంవీరెడ్డెప్ప(చిత్తూరు), నరేంద్రప్రసాద్(చిత్తూరు), కె.సుగుణ(జీడీనెల్లూరు), ఏ.గీతా(జీడీనెల్లూరు), కె.యశోదమ్మ(జీడీనెల్లూరు), ఎం.వేల్‌మురగన్(జీడీనెల్లూరు), కె.అనితారెడ్డి(జీడీనెల్లూరు)ను నియమించారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 71,122 మంది స్వామివారిని దర్శించుకోగా, 29,121 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి హుండీ కానుకలు రూ.3.76 కోట్లు అందాయి. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టోకెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి మూడో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ వి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీలోపు 'ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో కళాశాలను వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న తరువాత సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో చేరదలచిన వారికి 30వ తేదీ, ప్రైవేటు ఐటీఐల్లో చేరదలచిన వారికి 31వ తేదీ వరకు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన విద్యార్థులకు ఎటువంటి కాల్ లెటర్లు పంపించరని తెలిపారు. మరిన్ని వివరాలకు 94928 61369, 85000 21856, 94908 06942ను సంప్రదించాలని ఆమె కోరారు.

రేపటి నుంచి విద్యుత్ బస్‌చార్జీల తగ్గింపు

బస్సు రూట్	పాత చార్జీ	కొత్త చార్జీ
తిరుపతి–మదనపల్లె	రూ.300	రూ.260
తిరుపతి–నెల్లూరు	రూ.350	రూ.300
తిరుపతి–కడప	రూ.340	రూ.290

తిరుపతి అర్బన్: విద్యుత్ బస్సుల చార్జీలు శనివారం నుంచి తగ్గిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రనాథ్‌రెడ్డి గురువారం తెలిపారు. కాలుష్య నియంత్రణలో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా తిరుపతిలోని అలిపిరి డిపో కేంద్రంగా వంద విద్యుత్ బస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిలో తిరుపతి నుంచి తిరుమలకు 50 విద్యుత్ బస్సులు, తిరుపతి నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు 14, తిరుపతి నుంచి కడపకు 12, తిరుపతి నుంచి మదనపల్లెకు 12, తిరుపతి నుంచి నెల్లూరుకు 12 విద్యుత్ బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ విద్యుత్ బస్సుల్లో చార్జీలను తగ్గించినట్లు స్పష్టం చేశారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

పెన్షనర్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నాగరాజ

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు నాగరాజ తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి రామానుజరావు సమక్షంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా ఆర్.మురుగానంద, ఉపాధ్యక్షులుగా శ్రీరామమూర్తి, రాజరత్నంరెడ్డి, జయరాం, కుమారవర్మ, నారాయణస్వామి, రత్నారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా దశరథ నాయుడు, సంయుక్త కార్యదర్శులుగా ఏకాంబరనాయుడు, కోదండనాయుడు, లక్ష్మయ్య, చంద్రశేఖరనాయుడు, నాగస్, వెంకటేష్ ఎన్నికయ్యారని వెల్లడించారు.

వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు పూర్తి

- భక్తులకు ఇబ్బందుల్లేకుండా విస్తృత ఏర్పాట్లు
- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం



వరలక్ష్మీ వ్రతం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించనున్న వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. తిరుచానూరులోని ఆస్థాన మండపంలో గురువారం జేఈవో వరలక్ష్మీ వ్రతం ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వర్ణ రథంపై శ్రీ పద్మావతి అమ్మవారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నట్లు చెప్పారు. 500 మంది గృహస్తులు నేరుగా టికెట్లు కొనుగోలు చేసి ఆస్థాన మండపంలో పాల్గొంటారని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 778 మంది గృహస్తులు వర్చువల్ సేవ టికెట్లు బుక్ చేసుకున్నట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేయాలని జేఈవో అధికారులకు సూచించారు.

ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు

వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసినట్లు జేఈఓ తెలిపారు. అన్నప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేయాలని ఆదేశించారు. భక్తులకు పంపిణీ చేసేందుకు కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, గాజులు సిద్ధంగా ఉంచుకోవాలని, భజన బృందాలను ఏర్పాటు చేయాలని హిందూ ధర్మప్రచార పరిషత్ అధికారులను ఆదేశించారు. అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, ఇతర ప్రాంతాల్లో ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ చేపడుతున్నట్లు తెలిపారు. వరలక్ష్మీ వ్రతాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారాలు అందించేందుకు వీలుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జేఈవో, అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్ ఈఈలు మనోహర్, నరసింహ మూర్తి, ఏఈవో రమేష్, డిఈ ఎలక్ట్రికల్ చంద్రశేఖర్, ఆదనపు హెల్త్ ఆఫీసర్ డా.సునీల్, గార్డెన్ మేనేజర్ జనార్దన్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై కలెక్టర్ సమీక్ష

చిత్తూరు కార్పొరేషన్: నాడు-నేడు పనులపై కలెక్టర్ షణ్మోహన్ గురువారం సాయంత్రం రామకుప్పం మండలంలోని పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్షించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. రూ.లక్షకు పైగా ఉన్న నిధులు ఉన్న 37 పాఠశాలల్లో పది కాంపొనెంట్లకు సంబంధించి త్వరగా ఖర్చు చేయాలన్నారు. రూ.లక్ష కన్నా తక్కువ నిధులు ఉన్న పాఠశాలలు జీరో బ్యాలెన్స్‌ను చూపించాలని తెలిపారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శంకర్‌బాబు, డీఈఓ విజయేంద్రరావు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,490

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల

చిత్తూరు కార్పొరేషన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరంలోని 48వ డివిజన్ ఇందిరానగర్, సున్నపువీధి తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. సంక్షేమ పథకాలు అమలు తీరును తెలుసుకున్నారు. ఏఏ ఇంటికి పథకాల ద్వారా ఎంత లబ్ధి అందిందో వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పథకాలు లబ్ధి అందలంటే జన్మభూమి కమిటీల అనుమతి కావాల్సి వచ్చేదని, టీడీపీ శ్రేణులకే అందేవని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు కుట్ర రాజకీయాలకు తెరతీశారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని తెలిపారు. కార్పొరేటర్ రేఖ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి నారాయణ, మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్లు చల్లముత్తు, రెడ్డెప్ప, కోఆప్షన్ మెంబర్ కిరన్ నాయకులు భూపేష్ గోపినాథ్, కిషోర్, కన్నన్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేయాలి



జిలానీబాషాను సత్కరిస్తున్న పుంగనూరు నేతలు

పుంగనూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రిని చేసేలా ప్రజలను చైతన్య పరిచేందుకే ప్రజా సంక్షేమయాత్ర ప్రారంభించినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు జిలానీబాషా తెలిపారు. గురువారం యాత్రలో భాగంగా ఆయన పుంగనూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా జానపదకళల సంస్థ అధ్యక్షుడు కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ము కలసి ఆయనకు స్వాగతం పలికి, సన్మానించారు. జిలానీబాషా మాట్లాడుతూ మార్కాపురం నుంచి ఇచ్ఛాపురం వరకు 4200 కిలోమీటర్లు యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశానికే ఆదర్శంగా నిలిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి అందుతోందన్నారు. సీఎం జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజలను చైతన్యపరచి, రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండవీటి నటరాజ, రాజేష్, సురేష్, లక్ష్మణ్‌రాజు, నజీర్, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

చిత్తూరు అర్బన్: యాద మరి మండలం బుడితిరెడ్డిపల్లెలో గురువారం ఎస్ ఈబీ అధికారులు దాడు లు నిర్వహించి 25 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విక్రేత చంద్రశేఖరన్ (35) ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగన్ బాబు వచ్చారా నాయనా!



జగన్ బాబు వచ్చారా అని ఎమ్మెల్యే ఎంఎస్ బాబును అడుగుతున్న వృద్ధురాలు

యాదమరి: 'ఎవరు నాయనా.. జగన్ బాబు మా ఊరికి వచ్చారా.. అని ఎమ్మెల్యే ఎంఎస్ బాబును వృద్ధురాలు ఆసక్తిగా అడగడంతో అక్కడున్న వారు ఆశ్చర్యానికి గురయ్యారు. గురువారం మండలంలోని వరదరాజుల పల్లె పంచాయతీ కట్టకిందవూరులో ఎమ్మెల్యే, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి కట్టకిందవూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. 'నీకు పింఛన్ వస్తోంది కదా' అవ్వా అని ఎమ్మెల్యే అడగగానే, ఆమె మాట్లాడుతూ 'నాయనా జగన్‌బాబు వస్తారని ఊర్లోవారు ఎవరో చెప్పారు.. ఎక్కడ' అనగానే అందరూ ఆశ్చర్యపోయారు. అవ్వా జగనన్న రాలేదు, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వచ్చారని జెడ్పీ వైస్ చైర్మన్ చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 'నీకు జగనన్న ప్రభుత్వం ఇచ్చిన పథకాల లబ్ధి పట్టిక ఇందా... నీ దగ్గరే ఉంచుకో.. జగనన్న నీ దగ్గరికి వచ్చి అడిగినప్పుడు ఈ పట్టికను ఇవ్వు' అన్నారు. 'నాకు పింఛన్ ఠంచన్‌గా అందుతోంది నాయనా జగన్ బాబు చల్లగా ఉండాలి అని ఆమె దీవించింది.

సంస్కృతంతో ఉపాధి అవకాశాలు



కృష్ణానందను సన్మానిస్తున్న అధ్యాపకులు

వెదురుకుప్పం: సంస్కృతభాషలో పట్టు సాధించి విద్యార్థులు ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణానంద అన్నారు. తెలుగు భాషా వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రహ్మలిపి-ఉపాధి అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హిమాచల్‌ప్రదేశ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణానంద మాట్లాడుతూ దేశంలో అన్ని భాషలకు మూలం బ్రహ్మలిపిగా పేర్కొనే సంస్కృత భాష అని చెప్పారు. ఈ భాషలో సాహిత్య రూపంలో ఉన్న సంప్రదాయాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతీయ సంస్కృతిని బతికించుకునేందుకు సంస్కృత భాషను అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉపాధి అవకాశాలు మెండుగా ఉండే సంస్కృతాన్ని విద్యార్థులు ఎంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద మాట్లాడుతూ ఈ కోర్సులో ఉత్తీర్ణత సాధించి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు భీమమోహనరావు, చంద్రబాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రవిడ వర్సిటీ విద్యార్థుల ఆందోళన

కుప్పం: నాణ్యమైన భోజనం పెట్టడం లేదంటూ గురువారం ద్రవిడ వర్సిటీ హాస్టల్ విద్యార్థులు గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ వర్సిటీలోని హాస్టల్ సమయానికి భోజనం పెట్టడం లేదని, పదార్థాలు కూడా నాణ్యతగా ఉండడం లేదని, రుచి లేని పదార్థాలు తినలేక పస్తులు ఉండాల్సి వస్తోందని పేర్కొన్నారు. మూడు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు హాస్టల్‌లో ఉంటు చదువుకుంటున్నారని, కనీస వసతులు కూడా లేవని తెలిపారు. ఈ విషయమై వార్డన్‌కు పలుసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కారించాలని కోరారు.

ప్రజా జీవితం, కవిత్వ సారమే ఆముక్తమాల్యద

తిరుపతి సిటీ: ప్రపంచంలో శ్రీకృష్ణ దేవరాయలు వంటి చక్రవర్తి మరొకరు లేరని కరీంనగర్ జిల్లా ధర్మపురికి చెందిన డాక్టర్ సంగనభట్ల నరసయ్య తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో గురువారం వర్సిటీ సెనేట్ హాల్లో ఆచార్య కె సర్వోత్తమరావు ధర్మనిధి ఉపన్యాసం అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏ రాజూ గొప్ప కవిగా రాణించలేదని, రాయలు అచ్చ తెలుగు వాడని తెలిపారు. ఆయన జీవిత కాలమంతా శోధించి, ప్రజాజీవితాన్ని, కవిత్వ సారాన్ని తన ఆముక్తమాల్యదలో ఇమిడ్చి ప్రౌఢ ప్రబంధంగా రాశారని అన్నారు. రాయలు ఆరు సంస్కృత గ్రంథాలు రచించిన విషయం చాలా మందికి తెలియదన్నారు. ఆయన రాసిన జాంబవతీ పరిణయం అందరం చదవాలన్నారు. రైతులు, వ్యాపారులు, అటవీ ప్రాంత వాసుల జీవితం ఆముక్తమాల్యదలో వుందన్నారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్, అధ్యాపకులు రాజేశ్వరమ్మ, పేట శ్రీనివాసులరెడ్డి, ఆదిశేషయ్య, అశోక్ పాల్గొన్నారు.

వెంగమాంబ రచనల్లో స్త్రీ హృదయం



సదస్సులో ఉపన్యసిస్తున్న ఆచార్య సర్వోత్తమరావు

తిరుపతి కల్చరల్: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ తన రచనల్లో భాష, భావం, భావ వ్యక్తీకరణలో స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించారని ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడు సర్వోత్తమరావు తెలిపారు. వెంగమాంబ వర్ధంతి ఉత్సవాలు గురువారం అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సాహితీ సదస్సులో ఆచార్య సర్వోత్తమరావు వేంకటాచాల మహత్యం- లక్ష్మీదేవి అనే అంశంపై ప్రసంగించారు. వెంగమాంబ భక్తి రచనల్లో సంసారిక చిత్రాలకు సంబంధించి లక్ష్మీదేవి భర్తను అనుసరించడం, సేవించడం, కల్యాణం, తిరుమల కొండలు వంటి అంశాలతో పాటు ఆనాటి సామాజిక అంశాలను వివరించారని తెలిపారు. తిరుపతికి చెందిన విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తరిగొండ వెంగమాంబ విజయం అనే అంశంపై ప్రసంగించారు. చంద్రగిరికి చెందిన డాక్టర్ సంగీతం కేశవులు తరిగొండ వెంగమాంబ సాహిత్యంలో శ్రీవేంకటేశ్వర స్వామివారి వర్ణనలు- విశిష్టత అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సుశీల, డాక్టర్ శ్యాంకుమార్ ఆలపించిన భక్తి సంగీతం ఆకట్టుకుంది. సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన లావణ్య కుమారి, లక్ష్మీరాజ్యం బృందం సంగీత కచేరి అలరించింది. కార్యక్రమంలో టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ లత పాల్గొన్నారు.

పెళ్లైన ఆరు నెలలకే..



నాగమణి, సురేష్(ఫైల్)



మృతి చెందిన నాగమణి

గంగవరం: పెళ్లైన ఆరు నెలలకే వివాహిత ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గంగవరం మండలం చిన్నమనాయనిపల్లెలో గురువారం ఈఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు ..పలమ నేరుకు సమీపంలోని నడిమిదొడ్డిపల్లెకు చెందిన నాగమణి(20)కి గంగవరం మండలం మేలుమాయి పంచాయతీ చిన్నమనాయనిపల్లెకు చెందిన సురేష్‌తో ఆరు నెలల కిందట వివాహమైంది. పెళ్లైన కొత్తలో వీరి కాపురం సజావుగా సాగింది. అప్పుడప్పుడూ అత్తాకోడళ్ల మధ్య చిన్నపాటి గొడవలు జరిగేవి. సురేష్ గంగవరంలోని ఓ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులో పని చేస్తున్నాడు. గురువారం నాగమణి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పని ముగించుకుని మధ్యాహ్నా భోజనానికి ఇంటికి వచ్చిన సురేష్ భార్య ఉరికి వేలాడుతుండగా గమనించి పెద్దగా అరిచాడు. చుట్టుపక్కల వారు వచ్చి ఆమెను కిందికి దింపారు. కొనఊపిరితో ఉన్న ఆమెను పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి తరపు బంధువులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తింటివారే కడతేర్చారు..

పలమనేరు: గంగవరం మండలం చిన్నమనాయునిపల్లెలో తమ కుమార్తె నాగమణి(20) మృతికి భర్త, అత్తింటి వారే కారణమని మండలంలోని మొరం పంచాయతీ నడిమిదొడ్డిపల్లెకు చెందిన తండ్రి సోమశేఖర్ గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద విలేకరులతో గోడు వెల్లబోసుకున్నాడు. గురువారం తమ బిడ్డ ఆత్మహత్య చేసుకుందని సమాచారం అందిందన్నారు. ఆస్పత్రి వద్దకు వచ్చి చూస్తే అల్లుడుగాని, ఆయన తల్లిదండ్రులుగానీ లేరన్నారు. దీన్ని బట్టి తమ బిడ్డ మృతిపై అనుమానం ఉందని, పోలీసులు తమకు న్యాయం చేయాలంటూ విన్నవించారు.

రియల్ వ్యాపారి ఇంట్లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న దుస్తులు

చంద్రగిరి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు చొరబడి బంగారు, వెండి వస్తువులతో పాటు నగదును ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు, స్థానిక ప్రశాంతి నగర్‌లో ఉండే కొమ్మినేని నరసింహులు నాయుడు కుమారుడు నాగార్జున రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం మంగళవారం ఉదయం బెంగుళూరు వెళ్లి, బుధవారం రాత్రి వచ్చాడు. అయితే అప్పటికే తలుపులు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువాలో దాచుకున్న బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రాజశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలను సేకరించారు. బాధితుడు 25 సవర్ల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి వస్తువులతోపాటు కొంత నగదును దొంగలు దోచుకుపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు



పట్టుబడిన గంజాయిని చూపిస్తున్న ఎస్పీ

తిరుపతి క్రైం: గంజాయి స్మగ్లింగ్ ముఠాను రేణిగుంట రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పి పరమేశ్వర రెడ్డి వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నోడల్ అధికారి ఎ.రాజేంద్ర పర్యవేక్షణలో, తిరుపతి రూరల్ ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర, ఎస్ఐ భాస్కర్, సిబ్బంది రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. అక్కడే అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని వారిని తనిఖీ చేయగా సుమారు రూ.4,86,000 విలువ చేసే 54 కిలోల 27 ప్యాకెట్ల గంజాయి, 3 సెల్‌ఫోన్లు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఒడిశా నుంచి కొనుగోలు చేసి, రేణిగుంట మీదుగా ముంబైకు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తిరుపతి తుడా కార్యాలయం సమీపంలోని వినాయకనగర్‌కు చెందిన లేపాక్షి బాబా ఫక్రుద్దీన్‌కు చెందిన ముఠా ఇలాంటి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు చెప్పారు. ముంబైలోని రాహుల్, దేవదాస్ అనే వ్యక్తులకు విక్రయించేందుకు వీరు బయల్దేరారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న సమయంలో ఈ స్మగ్లింగ్ ముఠాను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో వినాయక నగర్‌కు చెందిన లేపాక్షి బాబా ఫక్రుద్దీన్ (53), లేపాక్షి మహ్మద్ ఆరీఫ్, అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన అలిమిశెట్టి రాధిక, చిత్తూరు జిల్లా విజయపురం గ్రామానికి చెందిన.ఎస్ షారిభా ఉన్నట్లు వివరించారు.